సాక్షి తిరుపతి

శనివారం । 29 । జూలై । 2023



తిరుపతిలో సృజనాత్మక పరిశ్రమలు

తిరుపతిలో సృజనాత్మక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. - IIలో



వేడుకగా అర్జున తపస్సు

పిచ్చాటూరు ధర్మరాజు స్వామి తిరునాళ్లలో భాగంగా అర్జున తపస్సు కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	27
చిత్తూరు	36	26
తిరుమల	31	21
గూడూరు	32	28
నగరి	37	27

న్యూస్‌రీల్

వర్షాలపై అప్రమత్తం



ముఖ్యమంత్రి సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

తిరుపతి అర్బన్: 'తరచూ వర్షాలు వస్తున్నాయి.. కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. బాధితులకు అండగా నిలవాలి'అని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన విజయవాడ నుంచి వర్చువల్ పద్ధతిలో జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. కోస్తా ప్రాంతాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉందని, అదేవిధంగా రాయలసీమ ప్రాంతాల్లోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలు అధికంగా ఉన్నచోట లోతట్టు ప్రాంతాల నుంచి పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి తాగునీరు, ఆహారం, చిన్నపిల్లల తల్లుల, గర్భిణుల విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. వర్షాలు తగ్గిన తర్వాత క్యాంపుల్లోని వారిని తిరిగి స్వగ్రామానికి వెళ్లేటప్పుడు ఒక్కో కుటుంబానికి రూ.2 వేలు, ఒక వ్యక్తి అయితే రూ.వెయ్యి ఇవ్వాలన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం, పంట నష్టం వివరాలు పంపాలని చెప్పారు. అందుబాటులో వైద్యులు, మందులు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పీ.పరమేశ్వర్‌రెడ్డి, జేసీ డీకే.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు



మాట్లాడుతున్న డీఏఓ ప్రసాద్‌రావు

తిరుపతి అర్బన్: ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో కంది, రాగి, జనుము, జీలగ విత్తనాలను అందిస్తోందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవా రం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా సజ్జ, మినుము ,పెసర, ఎన్ఎల్ఆర్ 3449, కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 5048కి చెందిన నాణ్యమైన వరి రకాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.లక్ష నుంచి రూ.50లక్షల మేరకు చేపల వ్యాపారం కోసం మత్స్యశాఖ యూనిట్లు అందిస్తోందని, ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా ఆక్వాహెర్బల్ రిటైల్ యూనిట్స్‌కు 90శాతం సబ్సిడీ వర్తిస్తుందని చెప్పారు.


ప్రకృతి ప్రోత్సాహకాలు



విత్తనాల కిట్టును అందిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ప్రకృతి సేద్యంతో పంటలు పండిస్తున్న చిన్న, సన్నకారు ఎస్సీ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ యే.నరసింహులు, ప్రకృతి వ్యవసాయ డీపీఎం మునిరత్నం నేతృత్వంలో శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ప్రకృతి వ్యవసాయ విత్తనాల కిట్టును పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కో విత్తనాల కిట్టు విలువ రూ.9,500 చేస్తుందని, వీటిని పూర్తిగా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో 1,925 మంది రైతులకు 19 రకాల కూరగాయల విత్తనాల కిట్లు అందించినట్లు వివరించారు. పీఎంఏజేఏవై పథకం ద్వారా ప్రభుత్వం రూ.1,82,87,500 ఖర్చు చేసిందన్నారు.

క్విజ్ పోటీలకు స్పందన




క్విజ్ పోటీ విజేతలతో వైద్యాధికారులు

తిరుపతి తుడా: మెడికల్ క్విజ్ పోటీలకు అనూహ్య స్పందన లభించిందని స్విమ్స్ శ్రీ పద్మావతి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శరణ్‌బీసింగ్ తెలిపారు. శ్రీ పద్మావతి మెడికల్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర స్థాయి 'ఫిజియాలజీ హయగ్రీవ' క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని ఆరు మెడికల్ కళాశాలల నుంచి యూజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలకు చెందిన భావన పండెయ్, ఫాగున్ బెల్, హారిక బృందం ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. పద్మావతి కళాశాల రిజిస్టర్ డాక్టర్ అపర్ణ బిట్ల, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ముక్తేశ్వరయ్య, డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఉమా మహేశ్వరరావు, ఫిజియాలజీ వైద్యులు పాల్గొన్నారు.

పరిశ్రమిస్తూ.. ఉద్యోగమస్తు!

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిశ్రమల ఖిల్లాగా విరాజిల్లుతోంది. విపక్ష పార్టీల నాయకుల కళ్లు బైర్లు కమ్మేలా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలను మరింత ప్రోత్సహిస్తోంది. పరిశ్రమల స్థాపనకు అనతికాలంలోనే సకల వసతులతో కూడిన అనుమతులు మంజూరు చేస్తోంది. దీనికితోడు పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా ఉండడం పెట్టుబడిదారులకు కలిసి వస్తోంది. నాలుగేళ్లలో సుమారు రూ.21వేల కోట్లకుపైగా పెట్టుబడులు రాగా.. 44వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు కల్పించింది.



సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు తీస్తోంది. పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోంది. ప్రత్యేక ఆర్థిక మండలిగా తొలుత ప్రారంభమైన శ్రీసిటీ 'ఏకీకృతపారిశ్రామిక నగరం'గా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు.. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు ఉండడం పారిశ్రామిక వేత్తలకు కలిసివస్తోంది. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ టెలికమ్యూనికేషన్, రక్షణ సారశక్తి, ఎరోస్పేస్, ఇంజినీరింగ్ యంత్ర సామగ్రి, దుస్తులు, ఆహార శుద్ధి, ఐటీ సంస్థలు భారీ పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. సత్యవేడులోని శ్రీసిటీ, ఏర్పేడు, రేణిగుంట, గంగవరంలో విదేశీ సంస్థలు తమ కర్మాగారాలను స్థాపించాయి.





శ్రీసిటీ ఏరియల్ వ్యూ

ఉపాధి సిటీ

సత్యవేడు శ్రీసిటీ పరిధిలో 28 దేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు రూ.4,860 కోట్ల పెట్టుబడులతో 215 కంపెనీలకు పైగా ఏర్పాటు చేశారు. వాటిలో ఆటోమొబైల్ కంపెనీలు, ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రికల్స్, ఇంజినీరింగ్ కంపెనీలు, ఎఫ్ఎంసీసీ ఫుడ్ ప్రాసెసింగ్, లాజిస్టిక్అండ్ వేర్‌హౌసింగ్, పేపర్ అండ్ ప్యాకేజింగ్, ఫార్మా అండ్‌హెల్త్‌కేర్, రీవబుల్ ఎనర్జీ, టెక్స్‌టైల్స్‌అండ్ నాన్ ఉవెన్‌ఫ్యాబ్రిక్, అథర్ సర్వీస్ సెక్టార్‌లు ఏర్పాటు చేశారు. ఒక్క శ్రీసిటీ పరిధిలోనే 60వేల మందికి ఉద్యోగాలు లభించాయి.

నగరాలను తలపిస్తున్న పల్లెలు

సత్యవేడు, వరదయ్యపాళెం, తడ, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, గంగవరం మండల పరిసరాల్లో నెలకొన్న గ్రామాలు నేడు పరిశ్రమల రాకతో శరవేగంతో అభివృద్ధిచెందుతున్నాయి. పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉపాధి అవకాశాలు లభించడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. గ్రామాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు పెరుగుతూ నగరాలను తలపిస్తున్నాయి. భౌగోళికంగా, సామాజికంగా, ఆర్థికంగా పురోగతి సాధిస్తూ ఆదర్శ ఆర్థిక మండళ్లుగా కీర్తి గడిస్తున్నాయి. సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని వరదయ్యపాళెం మండల పరిధిలో అపోలో టైర్ల పరిశ్రమ, అవంతి తోళ్ల పరిశ్రమ, హీరో మోటార్‌కు చెందిన ద్విచక్ర వాహనాల తయారీ పరిశ్రమల రాకతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి.

మహిళా సాధికారత

మహిళలు నేడు పారిశ్రామిక వాడల్లో ఉపాధి పొందుతూ కుటుంబ పోషణలో పాలుపంచుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. శ్రీసిటీలో మహిళలే సగం మంది ఉండడం ఇందుకు నిదర్శనం. కేవలం ఒక్క మొబైల్ ఫోన్ల తయారీ పరిశ్రమలోనే 15వేల మందికి పైగా మహిళలు పనిచేస్తుండడం విశేషం.

పక్క ఊర్లోనే ఉద్యోగం



మాది తడ. ఎంబీఏ పూర్తిచేశా. 2014లో శ్రీసిటీ ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ జపాన్ పరిశ్రమలో హెచ్ఆర్ ట్రైనీగా అవకాశం వచ్చింది. నేడు డిప్యూటీ అసిస్టెంట్ మేనేజర్‌గా పదోన్నతి లభించింది. మా ఇంటి నుంచి 2 కిలోమీటర్ల దూరంలో మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం అంటే మామూలు విషయం కాదు. నా భర్త కూడా ఈ ప్రాంతంలోని మరో పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. పన్నెండేళ్ల క్రితం తడ చుట్టు పక్కల అడవిని తలపించేది. ఇప్పుడు సిటీ మాదిరిగా ఉంది.

–టీ.సాయికృష్ణశ్రీ, డిప్యూటీ అసిస్టెంట్ మేనేజర్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, శ్రీసిటీ

పరిస్థితులు మారాయి



మాది సత్యవేడు మండలం, వానెల్లూరు గ్రామం. మా గ్రామంలో అమ్మాయిలకు ఇంటర్‌తో చదువు ఆపేసేవారు. అంతకు మించి చదివితే ఉద్యోగాల కోసం బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ వెళ్లాలి. అంత దూరం వెళ్లడం సేఫ్టీ కాదనుకునేవారు. గ్రామానికి అతి సమీపంలో శ్రీసిటీ రావడంతో పరిస్థితులు మారాయి. అమ్మాయిలు బాగా చదివి ఇక్కడే ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. మా ఊర్లో ఇంటికి ఇద్దరు చొప్పున పనిచేస్తున్నారు.

–వీ.నిరోషా, హెచ్ఆర్ ఎగ్జిక్యూటీవ్ అండ్ వెల్ఫేర్ ఆఫీసర్, కెల్లొగ్స్, శ్రీసిటీ

నాలుగేళ్లుగా క్యూకడుతున్న పరిశ్రమలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జపాన్, చైనా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్‌కు చెందిన పారిశ్రామిక వేత్తలు క్యూ కడుతున్నారు.
- జపాన్‌కు చెందిన ఇసుజు సంస్థ తన అనుబంధ కంపెనీ ఇసుజూ మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెట్‌ను రూ.3వేల కోట్లతో శ్రీసిటీలో నిర్మించింది.
- కొబెల్కో గ్రూపునకు చెందిన సంస్థ శ్రీసిటీలో క్రేన్ హైడ్రాలిక్ క్రేన్లు, కొబెల్కో కన్‌స్ట్రక్షన్ మెషినరీ విభాగాల కేంద్రాలను స్థాపించింది.
- త్యవేడు, వరదయ్యపాళెం, తడ, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, గంగవరం మండలాల పరిధిలో టైర్స్, ఫుడ్, ప్లాస్టిక్, ప్లైవుడ్, ఇంజినీరింగ్, కేబుల్, అల్యూమినియం, 2, 4 వీలర్స్, పీఓపీ, రెడీమేడ్స్, టైల్స్, డెయిరీ, గార్మెంట్స్, సీసీ కెమెరాల పరిశ్రమలను స్థాపించారు.
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలు వెయ్యికిపైగా ఏర్పాటు చేశారు.
- ఏడాది క్రితం రూ.5,430 కోట్లతో ఏర్పాటైన 19 భారీ పరిశ్రమల ద్వారా స్థానికులు 7,946 మంది ఉద్యోగాలు పొందారు.
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఈఎంసీ (ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్)-1, 2తోపాటు రేణిగుంట, గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్, తక్కిన చిన్న, భారీ, మధ్య తరహా పరిశ్రమలు మొత్తం 1,483 ఉండగా.. ఈ కర్మాగారాల్లో 36వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు.
- అమరరాజా, రిక్సక్లాత్ కర్మాగారాల్లోని ఉత్పత్తులతోపాటు రేణిగుంట మండలం గాజుల మండ్యంలోని కొన్ని ఫార్మా కంపెనీల ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ ఏర్పడింది.
- రూ.3,263 కోట్ల పెట్టుబడితో 9 పరిశ్రమలు ప్రారంభంకానున్నాయి. వీటి ద్వారా 5,607 మంది ఉపాధి పొందనున్నారు.
- ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబెల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో సుమారు రూ.10వేల కోట్ల పెట్టుబడులతో పారిశ్రామిక వేత్తలు ఎంఓయూలు కుదుర్చుకున్నారు.
- గూడూరు పరిధిలో 12 వేల ఎకరాల్లో రూ.5,800 కోట్లతో క్రిస్ సిటీ పేరుతో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో రూ.1,500 కోట్లతో రెండువేల ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. 3 లక్షల మందికి మరో 5 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.
- తిరుపతిలో రూ.వెయ్యి కోట్లతో 450 ఎకరాల్లో కాన్సెప్ట్ సిటీ ఏర్పాటుకు చురుగ్గా పనులు సాగుతున్నాయి.
- విజయపురం మండలంలో 8వేల ఎకరాల్లో శ్రీసిటీ తరహాలో ఓ పారిశ్రామిక వాడ రానుంది. ఇక్కడ పదివేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే కేశవపురం వద్ద కొంత భూసేకరణ పూర్తయ్యింది. ఇంకొంత భూమి సేకరించాల్సి ఉంది.

నాడు కష్ట తరం..

ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే గతంలో పేపర్లు చేతబట్టుకుని కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాలి. ఆ తరువాత ఎప్పటికో అధికారులు వెళ్లి విజిట్ చేసి రిపోర్ట్ ఇస్తారు. ఆ పరిశ్రమ ఏర్పాటుకు అధికారి అనుకూలంగా రిపోర్ట్ ఇవ్వాలంటే.. మామూళ్లు ఇవ్వక తప్పదు. ఇంకా వివిధ రకాల సబ్సిడీలు పొందాలన్నా లంచం ఇవ్వందే మంజూరు చేసేవారు కాదు.

నేడు సులభం.. మెరుగ్గా ప్రోత్సాహం

కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగే పనిలేకుండా ఆన్‌లైన్ విధానం ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 45 శాతం, పురుషులకు 35 శాతం సబ్సిడీ ఇప్పుడు లింగవివక్ష లేకుండా అందరికీ 45శాతం సబ్సిడీ ఇస్తున్నారు. పెట్టుబడి రూ.1.25 కోట్ల వరకు పెంచారు. గతంలో ఐదేళ్ల వరకు గ్రానైట్ పరిశ్రమకు యూనిట్ రూ.1 చొప్పున సబ్సిడీ ఇస్తుంటే.. నేడు ఎనిమిదేళ్లకు పెంచి యూనిట్ రూ.2 సబ్సిడీ ఇస్తున్నారు. కోవిడ్ సమయంలో చిన్న తరహా పరిశ్రమల కోసం రూ.100 కోట్ల వరకు ఇచ్చి ప్రోత్సహించారు.

మరిన్ని పరిశ్రమలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లాకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే పలు భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండు పారిశ్రామిక కారిడార్‌లు అభివృద్ధి చెందుతున్నాయి. పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులు మంజూరవుతున్నాయి. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కోవిడ్ సమయంలో నష్టపోయిన చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఆర్థిక సాయం అందించాం. రాబోయే రోజుల్లో మరిన్ని పరిశ్రమలు రానున్నాయి.

– ప్రతాప్‌రెడ్డి, జీఎం పరిశ్రమలశాఖ



గంగవరం వద్ద సెజ్ ఏరియల్ వ్యూ



రేణిగుంటలో ఏర్పాటైన వివిధ పరిశ్రమలు

'సురక్ష'కు సర్వత్రా ప్రశంసలు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరులో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్నంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నిర్వహించిన వార్డు బాటలో ఆయన పాల్గొన్నారు. ఎంపీ రెడ్డెప్పతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జగనన్న సురక్ష అనతికాలంలో ప్రజలందరికీ చేరువై మన్ననలు పొందిందన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులతో కలసి నిర్వహించిన కార్యక్రమంలో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామని వెల్లడించారు. అలాగే ప్రజలకు అవసరమైన ధ్రువీకరణపత్రాలను పంపిణీ చేశామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను కూడ అక్కడికక్కడే మంజూరు చేసినట్లు వివరించారు. ఈనెల 31వ తేదీ వరకు కొనసాగనున్న జగనన్న సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓర్వలేకే ఆరోపణలు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా పరిపాలన సాగిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి కొనియాడారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే చంద్రబాబు, ఆయన పుత్రుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తన హయాంలో చేసిన పనులను చెప్పకుండా, ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ చూస్తున్నారని, తగిన సమయంలో తప్పకుండా బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ నామరూపాలు లేకుండా పోతుందని స్పష్టం చేశారు. సమావేశంలో జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, విరూపాక్షి జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తిరుచ్చిపై అలిమేలు మంగమ్మ అభయం



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉత్సమూర్తులను శ్రీకృష్ణముఖ మండపం వద్ద కొలువు దీర్చి కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం అమ్మవారికి ఆలయ అలంకరణ మండపంలో ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు.

అందరివాడు జగనన్న!

- 62 వేల గడపల్లోనూ వ్యతిరేకత రాలా!
- టీడీపీ వార్డు నాయకులే జగనన్న సంక్షేమ పథకాలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు
- తిరుపతిలో 150 రోజులు పూర్తిచేసుకున్న గడప గడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: 'గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 62 వేల గడపలకు వెళ్లాం. ఏ ఒక్క గడపలోనూ వ్యతిరేకత రాలా.. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన, సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రతి గడపలోనూ హర్షం వ్యక్తమైంది' అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి 7వ డివిజన్‌లో శుక్రవారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం 150 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, 7వ డివిజన్ అధ్యక్షులు చిమట రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే, మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చాక పేదప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వారితో మమేకమై సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. దాంతో తాము ప్రతి గడపకు వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. గడప గడప కార్యక్రమం ప్రారంభించిన 150 రోజులలో 65 సచివాలయాల పరిధిలోని 1,339 క్లస్టర్లలో 62వేల గడపలకు వెళ్లినట్టు పేర్కొన్నారు. ఏ గడపల్లోనూ ప్రజల నుంచి చిన్న పాటి వ్యతిరేకత రాలేదన్నారు. అనేక వార్డుల్లో ఆయా వార్డుల టీడీపీ నాయకులు సైతం జగనన్న సంక్షేమ పథకాల పట్ల హర్షం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. తాము టీడీపీ నాయకులమని చూడకుండా అర్హతే ప్రామాణికంగా చేసుకుని రూ.12 లక్షల లబ్ధి చేకూర్చిన నాయకుడు జగనన్న అని కొనియాడారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి లాంటి నాయకుడినే ప్రజలతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం కోరుకుంటున్నారన్నారు. జగనన్న చేసిన మంచికి ఓటుతో రుణం తీర్చుకుంటామని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, టీ.మునిరామిరెడ్డి, వీ.నారాయణ, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుబాల, పార్టీ నాయకులు తలారి రాజేంద్ర, మహ్మద్ కాసీమ్, గఫూర్, బీ.రవిచంద్రారెడ్డి, జగదీష్‌యాదవ్, రమణ, గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు కుమార్, ధనశేఖర్, వెంకటేష్, శారద, పద్మజ గీతాయాదవ్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

తిరుపతి అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన విజయవాడ నుంచి కలెక్టర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వారం రాజకీయపార్టీ నేతలతో సమీక్షించాలన్నారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లాలని చెప్పారు. తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితోపాటు అడిషనల్ ఎస్పీ వెంకటరావు, డీఆర్వో కోదండరామిరెడ్డి, ఈఆర్‌ఓలు కనకనరసారెడ్డి, శ్రీనివాసులు, చంద్రముని, రామారావు, నగరపాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళేశ్వర్‌రెడ్డి, ఏఈఆర్‌ఓలు వెంకటరమణ పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్షలో కలెక్టర్, ఏఎస్పీ

క్లుప్తంగా

తిరుపతిలో సృజనాత్మక పరిశ్రమల ఏర్పాటు

తిరుపతి మంగళం: సృజనాత్మక పరిశ్రమలు ఏ ప్రాంతానికైనా, దేశానికైనా జాతీయ సంపద సృష్టిస్తాయని బ్రిటిష్ కౌన్సిల్ ఆర్ట్ డైరెక్టర్ జోనాథన్ కెన్నెడీ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో బ్రిటిష్ కౌన్సిల్ ఆర్ట్ డైరెక్టర్, సౌత్ ఇండియా డైరెక్టర్ జనక పుష్పనాథన్‌ను ఎంపీ గురుమూర్తి కలిశా రు. ఈ సందర్భంగా తిరుపతిలో సృజనాత్మక పరిశ్రమలు, సృజనాత్మక ఆర్థిక పరిజ్ఞానం, వాటి ఆధారిత ఆర్థిక కార్యకలాపాలపై చర్చించారు.

రేపు జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 30న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో డిప్యూటీ చీఫ్ టి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టాటా క్యాపిటల్ కంపెనీలో 500 లోన్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం జాబ్ మేళా చేపట్టనున్నట్లు తెలిపారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ పూర్తిచేసి 31 సంవత్సరాల వయస్సు లోబడిన వారు ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. దీంతోపాటు నాలుగేళ్ల అనుభవం కలిగి ఉండాలని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు తిరుపతి, శ్రీకాళహస్తి, పలమనేరు, చిత్తూరు, పులిచెర్ల ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆది వారం ఉదయం 10గంటలకు తిరుపతి, తిలక్ రోడ్డులోని కృష్ణ తులసి ప్యారడైజ్, ఫస్ట్‌ఫ్లోర్‌లో ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8886459910, 8197100215 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

రామచంద్ర యాదవ్ పబ్లిసిటీ స్టంట్

రేణిగుంట: భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకులు బోడె రామచంద్రయాదవ్ తన అనుచరులతో కలిసి రేణిగుంట విమానాశ్రయంలో పబ్లిసిటీ స్టంట్లు ప్రదర్శించారు. పార్టీ స్థాపన అనంతరం ఆయన పుంగనూరు వెళ్లేందుకు శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. సమీపంలోని సెల్‌కాన్ కంపెనీ కూడలి వద్ద పోలీసులు తమ అనుచరుల వాహనాలను ఆపేస్తున్నారని ఆరోపిస్తూ అనుచరులతో తిట్టించారు. రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ అక్కడికి చేరుకుని రామచంద్రయాదవ్‌కు సర్ది చెప్పి పంపించారు. అనంతరం వాహనాలు ర్యాలీగా రేణిగుంట మీదుగా తిరుపతికి వెళ్లాయి. ఆయన వాహన శ్రేణి ముందు సోషల్ మీడియా ప్రతినిధులతో ర్యాలీ వీడియో చిత్రీకరిస్తూ హంగామా చేశారు. రేణిగుంట చెక్‌పోస్ట్ కూడలి వద్ద మరోసారి వాహనాలను ఆపేసి హంగామా చేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

రామచంద్రయాదవ్‌పై కేసు నమోదు

భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్, అతని అనుచరులపై గాజుల మండ్యం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి ట్రాఫిక్ జామ్ చేసి ప్రజలు, వాహనచోదకులకు ఇబ్బంది కలిగించి సెక్షన్–30 పోలీస్ యాక్ట్‌ను ఉల్లంఘించినందున కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అందరం జగనన్నకు తోడుగా నిలుద్దాం

నాయుడుపేటటౌన్: సంక్షేమం, అభివృద్ధే అజెండగా సుపరిపాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరం తోడుగా నిలుద్దామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని వేముగుంటపాళెం పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు పూలు జల్లి, పూలమాలలు వేసి, శాలువలు కప్పి ఘనంగా స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి వారిని అప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. పలు ప్రాంతాల్లో స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేలా అభివృద్ధి పనులు

నాయుడుపేటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేలా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. పట్టణంలోని 24వ వార్డు మంగపతినాయుడు నగర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.



నాయుడుపేటటౌన్: ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న స్థానికులు

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

ఆర్యవైశ్య సంఘం నెల్లూరు రూరల్ జిల్లా అధ్యక్షుడు కే సుబ్రమణిని శుక్రవారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. సుబ్రమణి ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స చేసుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే స్థానిక వైఎస్సార్ సీపీత నాయకులతో కలసి సుబ్రమణి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో వేముగుంట పాళెం సర్పంచ్ జలదంకి హరిష్మ, విజయబాబురెడ్డి, గోపిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి ఎంపీపీ ధనలక్ష్మి, రూరల్ జేఏసీ కన్వీనర్ ఓ కిషోర్‌యాదవ్, చైర్



ఓజిలి: బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, నాయకులు కే రాజారెడ్డి, డీ విజయులు రెడ్డి, జె వెంకటకృష్ణారెడ్డి, బీ మల్లికార్జున రెడ్డి, కే జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకుందాం

ఓజిలి: రాష్ట్రంలో కులమతాలు, పార్టీలు, వర్గాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుందామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని కురుగొండలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికి శాలువాలతో సత్కరించి పూలమాలలతో స్వాగతం పలికారు. ప్రతి ఇంటికి వెళ్లి పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీ అరుణారెడ్డి, వైస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా, మాజీ సర్పంచ్ ఏ దిలీప్‌కుమార్ రెడ్డి, నాయకులు యూ హరనాథ్‌రెడ్డి, జీ వేణురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఏ కోటిరెడ్డి, ఎం రవీందర్‌రెడ్డి, డీ మధుసూదన్‌రెడ్డి, పీ హరనాథ్ రెడ్డి పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,220
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,498
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,500
రిటైల్ వెండి గ్రాము	రూ.77.50

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

తిరుపతి తుడా: తిరుపతి శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాలలో పారా మెడికల్ డిప్లొమా కోర్సుల దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరా దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 19వ తేదీ లోపు ఆసక్తి అర్హత కలిగిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణతలైన విద్యార్థులు డిప్లొమా కోర్సులకు అర్హులన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో మొత్తం 76 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీ – 30, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ – 30, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ –10, డిప్లొమా ఇన్ డార్క్ రూమ్ అసిస్టెంట్ – 6 సీట్లు అందుబాటులో ఉంటాయని, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలోని విద్యార్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. http://www. appmb.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకుని పూరించిన ఆ దరఖాస్తును ఆగస్టు 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు 100 రూపాయలు చెల్లించి పారా మెడికల్ విభాగంలో నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు మొబైల్ నంబర్ 9440879943 ను సంప్రదించాలన్నారు.

కోమల విలాస్‌పై దాడి

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీకోమలవిలాస్ హోటల్ వద్దకు శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు ఒక బస్సులో వచ్చి దాడి చేసి, అందులో వస్తువులు బయట పడేసి, కంకరరాళ్లు హోటల్‌కు అడ్డంగా పోశారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకోమలవిలాస్ హోటల్ స్థలం ఎస్ఏఎల్‌సీ చర్చి వారి నుంచి శ్రీహరి అనే అతను కొనుగోలు చేసి, భవనం నిర్మించి, బట్టా శివరామకృష్ణ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. అదే స్థలం తనకు కూడా రిజిస్ట్రేషన్ జరిగిందని శివరామకృష్ణ చెబుతున్నాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీహరి ఈ విషయమై ఇటీవలే శివరామకృష్ణపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శ్రీహరిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సుమారు 30 మంది కిరాయి రౌడీలు శుక్రవారం వేకువ జామున బస్సులో మారణాయుధాలతో వచ్చి, హోటల్‌పై దాడి చేశారు. ఈ హోటల్‌ను తాము లీజుకు తీసుకున్నామని చెప్పి, అక్కడ పనిచేస్తున్న వారిని బెదిరించి, వారి సెల్‌ఫోన్లు లాక్కుని బయటకు పంపేశారు. అనంతరం హోటల్‌లో ఉన్న కుర్చీలు, బెంచీలను బయటకు విసిరేశారు. హోటల్‌లో ఉన్న సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేసి, భవనానికి అన్ని వైపులా తాళాలు వేశారు. ఇదంతా చాలదన్నట్టు రెండు టిప్పర్ల కంకరరాళ్లు హోటల్‌కి అడ్డంగా పోసి, భీభత్సం సృష్టించారు. దీంతో బట్టా శివరామకృష్ణ ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, తడ, శ్రీహరికోట ఎస్‌ఐలు శ్రీనివాసులురెడ్డి, మనోజ్‌కుమార్‌లు హోటల్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.



శ్రీకోమలవిలాస్ హోటల్ ముందు తోలిన కంకర

31న మార్కెట్ల వేలం

గూడూరురూరల్: పట్టణంలోని కూరగాయాలు, చేపల మార్కెట్లలో దినసరి రుసుము వసూలు చేసుకునే హక్కుల వేలం పాటలను ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి 2024 సంవత్సరం మార్చి 31వ తేదీ వరకు చేపలు, కూరగాయల మార్కెట్లలో రుసుము వసూలు చేసుకునే హక్కుల వేలం కోసం శుక్రవారం వేలం పాటలు నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు. అయితే ఈ వేలం పాటలకు ఎవరు ముందుకు రాకపోవడంతో వాయిదా వేశామని చెప్పారు. ఈ నెల 31వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో మళ్లీ వేలం నిర్వహిస్తామని తెలిపారు.

బ్యాడ్మింటన్‌కు మహర్దశ

- తిరుపతిలో రాష్ట్ర స్థాయి అండర్–19 పోటీలు
- నేడు మెయిన్ డ్రా పోటీలు
- హాజరుకానున్న మంత్రి ఆర్కే రోజా

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించి క్రీడారంగానికి పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా 'ఆడుదాం ఆంధ్ర' వంటి బృహత్తర కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాలని పిలుపునిచ్చింది. క్రీడాశాఖా మంత్రి ఆర్కే రోజా చొరవతో తిరుపతి వేదికగా రాష్ట్రస్థాయి అండర్–19 బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. తిరుపతి జిల్లా ఏర్పడిన త ర్వాత రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు తిరుపతిలో జరగడం ఇదే ప్రథమం.

క్వాలిఫైయింగ్ లీగ్ పోటీలు ప్రారంభం

తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు జరగనున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ బ్యాడ్మింటన్ అండర్–19 పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 256 మంది పురుషులు, మహిళలు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. మెయిన్ డ్రా కోసం అర్హత సాధించేందుకు పలు జిల్లాల క్రీడాకారులు ఇండోర్ స్టేడియానికి చేరుకున్నారు. క్వాలిఫైయింగ్ లీగ్ పోటీలు ముగిసిన వెంటనే మెయిన్ డ్రాకు అర్హత పొందిన క్రీడాకారులు శనివారం ప్రారంభమయ్యే పోటీల్లో తలపడతారు. వీరితో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు సైతం ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడం విశేషం.

వసతి సదుపాయాలు భేష్

చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తుండగా.. సుమారు రూ.10 లక్షల వ్యయంతో క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు తిరుపతికి చేరుకున్నారు. టోర్నమెంట్ జరుగుతున్న ప్రాంతం వద్ద మంచినీటి సదుపాయాలతో పాటు, మెడికల్ సిబ్బందిని నియమించారు.

హాజరుకానున్న క్రీడాశాఖ మంత్రి

శనివారం ప్రారంభం కానున్న బ్యాడ్మింటన్ అండర్–19 మెయిన్ డ్రా మ్యాచ్‌లను రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖా మంత్రి ఆర్కే రోజా హాజరై లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆమెతో పాటు స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, నగర మేయర్, కమిషనర్ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

విద్యలో పెనుసంస్కరణలు



అదనపు భవనాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

- ఇంగ్లిష్ చదువులతో ఉజ్వల భవిత
- చిల్లకూరులో రూ.1.91 కోట్లతో గురుకుల అదనపు భవనం ప్రారంభం
- పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

చిల్లకూరు: దేశ చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుండిపోయేలా విద్యలో పెను సంస్కరణలు తీసుకొచ్చారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. చిల్లకూరులోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం రూ.1.91 కోట్లతో నూతనంగా నిర్మించిన అదనపు భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ విద్య, వైద్యానికి అండగా నిలిచి ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉన్నత వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉండే సీబీఎస్‌ఈ చదువును బడుగు, బలహీన వర్గాల వారికి కూడా అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియాన్ని ప్రవేశపెట్టి పిల్లల ఉజ్వల భవితకు బాటలు వేశారని కొనియాడారు.

రూ.400 కోట్లతో అంబేడ్కర్ విగ్రహం

డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రూ.400 కోట్లతో స్మృతివనంలో ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది చివరికల్లా సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి జాతికి అంకితం చేస్తామని మంత్రి తెలిపారు. అనంతరం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు మాట్లాడుతూ తొలిసారి చిల్లకూరులో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారని, అలాంటి పాఠశాలలో నేడు నూతన భవనాలను నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ప్రతి బిడ్డా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలన్న ధ్యేయంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో నేడు పిల్లలు చేరుతున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడారు. గురుకుల పాఠశాలలో ఇంకా చేపట్టాల్సిన పనులు ఉన్నాయని, వీటికి నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరారు. నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, డీసీఓ విజయభారతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్, మండల కన్వీనర్ అన్నంరెడ్డి పరంధామిరెడ్డి, గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ ట్రస్టులకు రూ.30 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి విరాళాన్ని అందజేస్తున్న దాతలు

తిరుమల: టీటీడీలోని పలు ట్రస్టులకు శుక్రవారం రూ.30 లక్షలు విరాళంగా అందింది. విరాళం చెక్కులను దాతలు తిరుమలలోని కార్యాలయంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి అందజేశారు. బెంగళూరుకు చెందిన మంజునాథరెడ్డి, కృష్ణారెడ్డి కలిసి ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.20 లక్షలు అందజేశారు. బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు ఆనందకుమార్ అనే భక్తుడు రూ.10 లక్షలు అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం: మండలంలోని శాఖమూరికండ్రిగ వద్ద గల గ్రానైట్ ఫ్యాక్టరీలో ఓ వ్యక్తి ఉరివేసుకుని తనువు చాలించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. రాజస్థాన్‌కు చెందిన మహేంద్ర (35) శాఖమూరికండ్రిగలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఎంతకీ తలుపు తీయకపోవడంతో తోటికూలీలు యజమాని వసంత నాయుడుకు సమాచారం అందించారు. ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందజేయగా.. వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఉరికి వేలాడుతున్న మహేంద్రను కిందకు దించారు. పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఐదు ఐచ్ఛిక సెలవులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలోని అన్ని పాఠశాలలు ఐదు రోజులు ఆప్షనల్ హాలిడేస్ (ఐచ్ఛిక సెలవులు) ఉపయోగించుకోవచ్చని తిరుపతి జిల్లా డీఈఓ డాక్టర్ వి.శేఖర్, డీసీఈబీ కార్యదర్శి ఆర్.వంశీరాజ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న మొహర్రం, ఆగస్టు 25న వరలక్ష్మీ వ్రతం, నవంబరు 27న కార్తీక పౌర్ణమి, డిసెంబరు 26న బాక్సింగ్ డే, 2024 జనవరి 1న వీటిని వినియోగించుకోవచ్చన్నారు. అలాగే లోకల్ హాలిడేస్ కింద మూడు రోజులు ఆయా ప్రాంతాల్లో స్థానికంగా నిర్వహించే ముఖ్య పండుగలకు సంబంధిత ఉన్నతాధికారులు అనుమతి తీసుకుని సెలవులు తీసుకోవచ్చని వారు పేర్కొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- అంతరాయాల పర్యవేక్షణకు కాల్ సెంటర్ల ఏర్పాటు
- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) సీఎండీ సంతోష రావు సూచించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే అంతరాయాలను పర్యవేక్షించడానికి సర్కిల్ కేంద్రాల్లోని సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/టెక్నికల్ నియంత్రణలో ఈ పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నంబరు 1912కు అదనంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యే వరకు 24 గంటలు పర్యవేక్షణ కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు, నియంత్రికలు దెబ్బతినడంతో పాటు ఇతర విద్యుత్ సరఫరా సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆయా సర్కిల్ పరిధిలో ఈ కింది నంబర్లను సంప్రదించవలసిందిగా వినియోగదారులకు సూచించారు.



మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

నెల్లూరు: 94408 17468
తిరుపతి: 94408 17412
కడప: 94408 17440
అనంతపూర్: 94910 67446
కర్నూలు: 73826 14308

వేడుకగా అర్జున తపస్సు

పిచ్చాటూరు: పిచ్చాటూరు ధర్మరాజు స్వామి తిరునాళ్లలో భాగంగా శుక్రవారం ఉదయం అర్జున తపస్సు కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని తాటి చెట్టుపై అర్జున వేషధారు ఎక్కి తపస్సు చేస్తూ నిమ్మకాయలను జారవిడవగా.. వాటిని దక్కించుకోవడానికి మహిళలు పోటీపడ్డారు. అనంతరం గ్రామ దేవత గంగమ్మకు మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహిళలు పాలముంతలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని ధర్మరాజు స్వామి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. సాయంత్రం అర్జునుని ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించారు. కంకణ దీక్షాపరులు ఊరేగింపు సేవలో తరించారు. ఏర్పాట్లను సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.




పాలముంతలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

క్లుప్తంగా

ఒకటిన మండల మీట్

వెంకటగిరిరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఆగస్టు ఒకటో తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులు, తాగునీరు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై మండలస్థాయి అధికారులతో సమీక్షించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



విశేషాలంకరణలో పీర్లు

వెంకటగిరి: పట్టణంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పీర్లగుట్టపై కొలువైన పీర్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పట్టణంలోని 21వ వార్డులో ఉన్న హజరత్ హట్లే సాహెబ్ పీర్లచావిడి నిర్వాహకుల ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు హాజరై, ముస్లిం మతపెద్దలతో కలిసి పట్టణ ప్రజలకు అన్ని రంగాల్లో మంచి జరగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భూముల పరిశీలన



భూములు పరిశీలిస్తున్న అధికారులు

వాకాడు: మండలంలోని తీర ప్రాంత గ్రామాలకు నీటినందించడానికి తెలుగు గంగ కాలువ నిర్మాణానికి శుక్రవారం ఇరిగేషన్ అధికారులు భూముల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా తెలుగు గంగ ఏఈ ముని, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు సిబ్బంది మండలంలోని నిడిగుర్తిలో భూములను పరిశీలించి, నివేదికలు ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

హెల్త్ కార్డులు మంజూరు చేయాలని వినతి

చిల్లకూరు: క్లస్టర్ రీసోర్స్ పర్సన్లుగా సర్వశిక్ష(విద్యాశాఖ)లో పనిచేసే వారికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు శుక్రవారం చిల్లకూరు మండలంలోని సీఆర్పీలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన క్లస్టర్ పరిధిలో సీఆర్పీలుగా పనిచేస్తున్న తమకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. అలాగే టైం స్కేల్ ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించేలా తమ వినతిని సీఎం జగన్ మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సీఆర్పీలు రమణయ్య, ఏడుకొండలు, వాసు, పాల్‌రాజ్, తదితరులు ఉన్నారు.

ఈక్రాప్ నమోదు చేయాలి

సైదాపురం: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే ప్రతి పంటను ఈక్రాప్ నమోదు చేయాలని ఉద్యానవనశాఖ అధికారి ఆనంద్, వ్యవసాయశాఖ అధికారి హైమావతి కోరారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో సాగు చేసే పంటకు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయాలని కోరారు. ఈక్రాప్ నమోదుతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

గూడూరురూరల్: విద్యుత్ శాఖ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు రెండో రోజు నిరసన కార్యక్రమాలు కొనసాగించినట్లు డిస్కం ఈఈ ఇస్మాయిల్ తెలిపారు. గూడూరు సమీపంలోని గోగినేనిపురం వద్ద ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మన్ జి.శివశంకర్, కోచైర్మన్ జి.మునీంద్ర, డీఈలు ఎల్.ప్రసాద్, శ్రీనివాసులు, ఏఈలు రవికుమార్‌రెడ్డి, శేషాద్రి, మదన్ మోహన్, ఏడుకొండలు, జి.వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కోటలో శాంతి ర్యాలీ



శాంతియుత ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

కోట: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ క్రైస్తవ సంఘాల నాయకులు, క్రైస్తవులు శుక్రవారం కోటలో ర్యాలీ నిర్వహించారు. కేవీసీ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోటక్రాస్‌రోడ్డు నుంచి బజారువీధిలోని గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. పలువురు క్రైస్తవ మత పెద్దలు మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవ సంఘాలు చేపట్టిన ర్యాలీకి బీఎస్పీ మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో కేవీసీ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దినకర్‌బాబు, కార్యదర్శి నోవాబాబు తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం పోలమ్మది వాకాడు మండలం వెంకటరెడ్డిపాళెం గ్రామం. గతంలో పింఛన్ కోసం పలుసార్లు దరఖాస్తు చేసుకున్న రాలేదు. దీంతో ఆమె ఊర్లోని సచివాలయంలో సంప్రదించింది. సచివాలయ సిబ్బంది ఆమెతో కొత్తగా దరఖాస్తు చేయించి, ఆమెకు నెల రోజుల లోపు పింఛన్ మంజూరు చేయించారు. దీంతో పోలమ్మ గత మూడేళ్లుగా పింఛన్ తీసుకుంటోంది. తనకు పింఛన్ మంజూరు చేసిన సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది.



వాకాడు మండలం కాశీపురం గ్రామానికి చెందిన కోట్లపూడి శ్రీనివాసులు వ్యవసాయ కూలి. ఇతనికున్న 12 అంకణాల ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చాలా కాలంగా ప్రయతించాడు. అయితే రిజిస్ట్రేషన్‌కు సరిపడ నగదు అతడి వద్ద లేకపోవడంతో పలుసార్లు వాయిదా వేసుకున్నాడు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు అనంతరం కొండాపురం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. 10 రోజుల్లో కేవలం రూ.10కే రిజిస్ట్రేషన్ అయ్యింది.



సచివాలయం.. సేవలు సాకారం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారమైంది. పల్లె ప్రజల అవసరాలు, కష్టాలు తీర్చేలా గ్రామంలో ఏర్పాటు చేసిన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో పూర్తి పారదర్శకంగా.. నేరుగా జనం గడపలోకే సేవలు అందుబాటులోకి వచ్చాయి. సకల సేవలు సచివాలయాల్లోనే అందుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



- గ్రామాల్లోనే సమస్యలు పరిష్కారం
- సచివాలయ సేవలతో ప్రజలకు తప్పిన కష్టాలు

వాకాడు: ప్రజల చెంతకే ప్రభుత్వం అన్న నినాదాన్ని గ్రామ సచివాలయాలు నిజం చేస్తున్నాయి. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు నడుం బిగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ నూతన ఒరవడి సృష్టిస్తోంది. ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను అందించడంలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్లు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి మండల కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండేది కాదు. ప్రస్తుతం గ్రామాల్లోనే సచివాలయాల ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలను ప్రజలకు అందజేస్తున్నారు. వాకాడు మండలంలో 12 సచివాలయాలు ఉన్నాయి. అందులో 104 మంది సచివాలయ సిబ్బంది, 241 వలంటీర్లు పని చేస్తున్నారు. వాకాడు మండలంలో అధికంగా తీర ప్రాంత గ్రామాలున్నాయి. అందులో 40 నుంచి 50 కిలో మీటర్లు దూరం ఉన్న తీర గ్రామాలు ఉన్నాయి.

వీరంతా ఒకప్పుడు మండల కార్యాలయాలకు రావాలంటే కూలి పనులు మానుకుని తెల్లవారు జామునే కూడు మూట కట్టుకుని ఏదో ఒక వాహనంలో మండల కేంద్రానికి వచ్చే వారు. సాయంత్రం వరకు కార్యాలయాల వద్ద పడిగాపులు కాచి పనులు చేసుకుని తిరిగి ఏ అర్ధరాత్రికో ఇంటికి చేరుకునే వారు. అప్పట్లో వాహన సదుపాయం పెద్దగా లేకపోవడంతో వారు నానా తిప్పలు పడేవారు. ప్రస్తుతం వీరంతా తమ గ్రామాల్లోనే ఉన్న సచివాలయాల్లో ఎంచక్కా పనులు చేసుకుని, ఖర్చులు తగ్గించుకుని, ఎంతో సంతోషంగా జీవిస్తున్నారు.

మండలం :	వాకాడు
సచివాలయాల సంఖ్య :	12
గ్రామ పంచాయతీలు :	19
గ్రామాలు :	42
వలంటీర్ల సంఖ్య :	241
సచివాలయ సిబ్బంది :	104
అందుతున్న సేవలు :	42

అందుతున్న సేవలు

పథకం పేరు	లబ్ధిదారులు సంఖ్య
వైఎస్సార్ పెన్షన్ కానుక	5,294
వైఎస్సార్ చేయూత	2,620
వైఎస్సార్ ఆసరా	6,009
వైఎస్సార్ రైతు భరోసా	36,009
వైఎస్సార్ వాహన మిత్ర	201
జగనన్న తోడు	308
జగనన్న విద్యా దీవెన	746
జగనన్న వసతి దీవెన	728
జగనన్న అమ్మఒడి	4,226
జగనన్న సున్నావడ్డీ	6,250
జగనన్న పేదల ఇళ్లు	923
మత్స్యకార భరోసా	1,028

గతంలో మధ్యవర్తులను ఆశ్రయించేవాళ్లం



గత ప్రభుత్వ హయాంలో సచివాలయాలు లేకపోవడంతో తమ పిల్లలకు ఏదైనా సర్టిఫికెట్ అవసరమైతే కూలి పనులు మానుకుని మండల కేంద్రానికి పోలేక మధ్యవర్తులకు కొంత సొమ్ము ముట్టజెప్పి పనులు చేసుకునే వాళ్లం. ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో సచివాలయాలు, వలంటీర్లును ఏర్పాటు చేయడంతో ఊళ్లోనే పనులు జరుగుతున్నాయి. దీంతో మాకు కూలి డబ్బులతోపాటు అదనపు ఖర్చులు మిగులుతున్నాయి.

– ఓడపాళెం మునస్వామి, మత్స్యకారుడు, లైట్ హౌస్

సకాలంలో సేవలు అందిస్తున్నాం



సచివాలయాల ద్వారా అందించే సేవలను మరింత విస్తృతం చేస్తున్నాము. ప్రజలకు సకాలంలో సేవలను అందించేందుకు సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రతి ఇంటికి వలంటీర్లను పంపి, అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలు ఉచితంగా చేసి ఇస్తున్నాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ సిబ్బంది సేవలను అందిస్తున్నారు.

– గోపీనాథ్, ఎంపీడీఓ, వాకాడు

ప్రజల పండుగగా పోలేరమ్మ జాతర



మాట్లాడుతున్న సాయికృష్ణ యాచేంద్ర

వెంకటగిరి: గ్రామదేవత పోలేరమ్మ జాతర ఏ ఒక్కరి కోసమో, కొందరి కోసమో కాకుండా ప్రజల పండుగగా జరగాలని ఎస్వీబీసీ చైర్మన్, రాజా కుటుంబీకుడు డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర తెలిపారు. స్థానిక రాజాప్యాలెస్‌లో శుక్రవారం ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్రను వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల వెంకటగిరి పర్యటనలో రాష్ట్రపండుగగా పోలేరమ్మజాతరను ప్రకటించడం సంతోషకరమన్నారు. ఈ విషయంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కృషి ఎంతో ఉందని చెప్పారు. నేదురుమల్లి మాట్లాడుతూ జాతర నిర్వహణలో వెంకటగిరి రాజాల సలహాలు, సూచనలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ చైర్మన్ పి రామారావు, బండి రమేష్‌రెడ్డి, తోట గణేష్‌రెడ్డి, పోలేరమ్మ ట్రస్టుబోర్డు సభ్యుడు పులిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కడప బ్రహ్మయ్య, కూనా మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే పేదల హక్కుల సాధన



ఐక్యతా విజయపథం ర్యాలీలో విజయ్‌కుమార్

నాయుడుపేటటౌన్: ఐక్యతతోనే పేదలు తమ హక్కులు సాధించుకోవచ్చని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. ఆయన చేపట్టిన ఐక్యతా విజయపథం పాదయాత్ర శుక్రవారం నాయుడుపేటకు చేరింది. మండలంలోని బిరదవాడ, ఎంఆర్ నగర్, జువ్వలపాళెం తదితర గ్రామాల్లో ఐక్యతా విజయ పథం ర్యాలీ నిర్వహించారు. అక్కడ నుంచి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం పర్యటించి పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి సౌకర్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ నిర్మలాదేవి

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్రతి ఇంటికీ మరుగుదొడ్డిని నిర్మించేందుకు సిద్ధమవుతుందని ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో జగనన్న కాలనీల్లో ఒక్కొక్క ఇంటికి రూ.6 వేల వ్యయంతో సోప్ పిట్‌లను నిర్మిస్తుందన్నారు. అలాగే ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి సౌకర్యం కల్పించేలా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.12 వేలు అందజేస్తారని చెప్పారు. హౌసింగ్ ఏఈ అహ్మద్ బాషా, ఉపాధి ఏపీఓ గిరిబాబు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

శ్రీకాళహస్తి(బాలాయపల్లె): రీ సర్వే నిర్వహణ, ఓటర్ల నమోదుపై రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు బాధ్యతగా వ్యవహరించాలని ఆర్డీఓ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రెవెన్యూ అదనపు భవనం ప్రారంభించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



వాకాడు: లబ్ధిదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

వాకాడు: పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం బాలిరెడ్డిపాళెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పని చేస్తున్న వలంటీర్లను పవన్‌కళ్యాణ్, చంద్రబాబు హేళన చేయడం సరికాదన్నారు. వారికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి లాగా ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, ఎంపీడీఓ గోపీనాథ్, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్ రామకృష్ణ, వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కే దామోదర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, నాయకులు డీ అజిత్‌కుమార్‌రెడ్డి, పీ కోటేశ్వరరెడ్డి, ఎం కిరణ్‌రెడ్డి, ఎం కృష్ణయ్య, ఆర్ రవీంద్ర, కే మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు లబ్ధి

కోట: జగనన్న సురక్షతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. కోటలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని, లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 10,576 మంది జగనన్న సురక్ష ద్వారా లబ్ధిపొందారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ వినోద్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ పీ సంపత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ ఎస్ రమణయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ మొబీన్, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఉపసర్పంచ్ జీ భాస్కర్, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవానీ పాల్గొన్నారు.

ఇంటిముంగిటకే సంక్షేమ ఫలాలు

వెంకటగిరిరూరల్: ప్రతి పేదవాడి ఇంటి ముంగిటకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి అన్నారు. మండలంలోని పాళెంకోటలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తనుజారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ పద్మావతి, ఉపసర్పంచ్ సుమతి, నాయకులు వేణురెడ్డి, శ్రీనివాసులు, పీఏసీఎస్ అధ్యక్షులు భాస్కర్ పాల్గొన్నారు.

సురక్షతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు



కోటలో..



వెంకటగిరి రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తనుజారెడ్డి

పెళ్లకూరు: జగనన్న సురక్షతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాలచ్చూరులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గత టీడీపీ పాలనలో సర్టిఫికెట్ల కోసం కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి ఉండేదని, నేడు ముంగిటే సర్టిఫికెట్లు ఉచితంగా అందుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు, కార్యదర్శి వసంత్‌కుమార్, వీఆర్వో రమేష్, జేసీఎస్ కన్వీనర్ కే రఘునాయుడు పాల్గొన్నారు.

కడపత్ర సచివాలయం పరిధిలో..

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని కడపత్ర సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు సీ అరుణ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. నెల రోజుల నుంచి జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం ముగిసింది. సచివాలయ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మానవసేవే మాధవ సేవని..

వలంటీర్లకు వందనం



హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారీ చేయిస్తున్న వలంటీర్ జెట్టి చంద్రశేఖర్

సూళ్లూరుపేట రూరల్: రోజురోజుకూ విజృంభిస్తున్న కరోనా మహమ్మారి.. పూట పూటకూ రెట్టింపు అవుతున్న కేసులు..బయటకు రావాలంటేనే హడలుతున్న జనం.. కరోనా సోకిన వారి ఇళ్ల పరిసరాలకు వెళ్లాంటేనే జంకు.. అయినా ఆ వలంటీర్ మానవసేవే..మాధవ సేవగా భావించాడు. ప్రాణాలకు తెగించి.. కరోనా బాధితులు ఇళ్ల పరిసరాల్లో హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారీ చేయించాడు. చెరువుకండ్రిగ గ్రామంలో కరోనా నియంత్రణకు చర్యలు చేపట్టాడు. కరోనా మహమ్మారిని లెక్క చేయకుండా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు, ప్రభుత్వ సాయం అందజేశాడు. గ్రామంలో కరోనా ప్రబలడంతో భయపడి సుదూర గ్రామాల్లోని తమ మనుమలు, మనుమరాళ్ల ఇళ్లకు వెళ్లిన వృద్ధులకు సైతం మోటారుసైకిల్‌పై వెళ్లి పింఛన్ అందించి శభాష్ అనిపించుకున్నాడు వలంటీర్ జెట్టి చంద్రశేఖర్. అతడు తనకు కేటాయించిన 50 ఇళ్లలో లబ్ధిదారులను తన కుటుంబ సభ్యుల్లాగా భావించి సేవలు అందించాడు.

బైక్‌పై వచ్చి పింఛన్ ఇచ్చాడు



కరోనా సమయంలో చాలా ఇబ్బందులు పడ్డాను. కరోనా సమయంలో చెన్నై సమీపంలోని మీంజూరు గ్రామంలో ఉన్న నా మనవరాలు ఇంటికి వెళ్లి పోయాను. నాకు రావాల్సిన మూడు నెలల పింఛన్ అందలేదు. లాక్‌డౌన్ పూర్తిగా ఇంకా తొలగలేదు. వలంటీర్‌కు ఫోన్ చేశాను. వెంటనే సచివాలయంలో నా సమస్య తెలియజేసి, మీంజూరుకు బైక్‌పై వచ్చి మూడు నెలల పింఛన్ అందజేశాడు. అతడి సేవలు మరువలేనివి.

– రంగమ్మ , చెరువుకండ్రిగ, సూళ్లూరుపేట మండలం

గడప గడపకు మన ప్రభుత్వంతో ప్రజలకు మేలు



బుక్‌లెట్‌ను అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 11వ వార్డు పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. అర్హత ఉండి ఎవరికైనా ఇంకా సంక్షేమ పథకాలు అందకుంటే వారికి అందించేందుకు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఆ వార్డు కౌన్సిలర్ టి సుకన్య, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, కౌన్సిలర్‌లు వహీద, కే కళ్యాణి, ఎం జానకిరామయ్య, ఎస్ గోపాలకృష్ణ, నేతలు జీ కామాక్షి, నాగరాజు, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ పరిశీలన



కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి పట్టణంలో శిథిలావస్థకు చేరిన కూరగాయలు, మాంసం మార్కెట్‌ను శుక్రవారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. వెంకటగిరి పంచాయతీగా ఉన్న సమయంలో ఏర్పాటైన మార్కెట్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉండడం, నేడు పట్టణం గణనీయంగా పెరగడం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ ఏర్పాటు అంశంపై స్థానిక వ్యాపారులు, పట్టణ ప్రముఖులతో కలిసి చర్చించి మార్కెట్ ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్ చైర్మన్లు సీహెచ్ ఉమామహేశ్వరి, ఎస్ బాలయ్య, పార్టీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి సీ హరికృష్ణ, జేసీఎస్ కన్వీనర్ పీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు డీ బాలకృష్ణ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, యాస్దానీబాషా, వీ కృష్ణయ్య పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రీసర్వే



బత్తలాపురంలో రీసర్వే వివరాలను తెలుసుకుంటున్న ఆర్డీఓ చంద్రముని

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే ఎంతో ఉపయోగపడుతుందని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని అన్నారు. మండలంలోని బత్తలాపురంలో రీసర్వే పూర్తి కావడంతో రైతుల పొలాల్లో హద్దురాళ్ల ఏర్పాటును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు రీసర్వే చేస్తున్నారని చెప్పారు. రైతులు రీసర్వేలో పొలాలను అధికారులకు చూపి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రీసర్వే పూర్తి అయిన వెంటనే గ్రామంలో గ్రామసభ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సర్వే డీటీ మధుసూదన్‌రావు, సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ విజయ్‌కుమార్, వీఎస్ నాగూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు చేయించుకోండి



కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి అమరేంద్రనాథ్‌రెడ్డి

రాపూరు: శరీరంలో స్పర్శలేని పొడలు ఉంటే వెంటనే సమీపంలో ఉన్న పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని టీబీ, హెచ్ఐవీ, లెప్రసీ నివారణ జిల్లా అధికారి అమరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన వేపినాపి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం రావిగుంటపల్లెలోని నజరేత్‌కాలనీ సందర్శించి, అక్కడ ఉన్న కుష్టు వ్యాధిగ్రస్తులకు ఎంసీఆర్ చెప్పులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించి, ప్రభుత్వపరంగా వారికి తగు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారికి సూచించారు. అనంతరం రాపూరు పీహెచ్‌సీ ల్యాబ్‌ను సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ న్యూక్లియర్ సిస్టమ్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర, మండల వైద్యాధికారి వీవీ సూర్యధర్మేంద్ర, ప్రమీలారాజకుమారి, సుదర్శనమ్మ తదితరులు పాల్గొన్నారు.

20 అంశాల అజెండాకు ఏకగ్రీవ ఆమోదం



సమావేశంతో పాల్గొన్న సభ్యులు

వెంకటగిరి: పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన 20 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్‌సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులందరూ సమష్టి కృషితో వెంకటగిరి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒకటో వార్డు కౌన్సిలర్ పి సుబ్బారావు మాట్లాడుతూ వార్డు పరిధిలోని శ్మశానవాటికకు దారి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. 4వ వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ మాట్లాడుతూ అభివృద్ధి పనులు కేటాయింపుల్లో తన వార్డుకు ప్రాధాన్యత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదో వార్డు కౌన్సిలర్ నారిశేఖర్ మాట్లాడుతూ తమ వార్డులోని కాలేజీమిట్టలో శ్మశాన వాటిక ఆక్రమణకు గురవుతుందన్నారు. భ్రమరాంబ థియేటర్ వద్ద స్థలం కూడా ఆక్రమణకు గురైయిందని, అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆరోవార్డు కౌన్సిలర్ మాడా జానకిరామ్ మాట్లాడుతూ తమ వార్డులో ఏర్పాటు చేసిన పార్కులో క్రీడా పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. 8వ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య మాట్లాడుతూ రైల్వేస్టేషన్ నుంచి పెరియవరం వరకు రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు చేపట్టలేదన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ కందాటి కళ్యాణి మాట్లాడుతూ జగనన్న కాలనీలో తాగునీటి వసతి, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. 10వ వార్డు కౌన్సిలర్ శివయ్య మాట్లాడుతూ పరశురాం కాలనీ, జగనన్న కాలనీలో వీధుల్లో రోడ్లను అభివృద్ధి చేయాలన్నారు. 12వ వార్డు కౌన్సిలర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ వార్డు పరిధిలోకి వస్తున్న చెరువునీరును కైవల్యానదిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీకి 197 చేనేత జాకార్డ్ మిషన్‌లు మంజూరుకాగా ఒకే వార్డుకి పరిమితం చేయడం ఏమటని ప్రశ్నించారు. 16వ వార్డు కౌన్సిలర్ ధనియాల రాధ మాట్లాడుతూ తమ వార్డులోని రాజావీధిలో డ్రైనేజీ సమస్య ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య, ఆటంబాకం శ్రీనివాసులు పాల్గొన్నారు.